మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బీఆర్‌ఎస్ రెబల్ అభ్యర్థి జ్యోతి 8లో..

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం 8లో..

ఎన్నికల కార్యాచరణ షురూ

- లోక్‌సభ ఎన్నికల కోసం ఉద్యోగుల సమాచార సేకరణ వేగవంతం
- 55 శాఖలు...46 రకాల సమాచారం
- పోలింగ్ కేంద్రానికి ఐదుగురు సిబ్బంది నియామకం
- అదనంగా మరో 20 శాతం మంది



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు(ఫైల్)

జగిత్యాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వచ్చే నెల మార్చిలో వెలువడుతుందనే ప్రచార నేపథ్యంలో అధికార యంత్రాంగంలో హడావుడి మొదలైంది. ఎన్నికల నిర్వహణలో ప్రధాన భూమిక పోషించే సిబ్బంది సమాచార సేకరణ, కంప్యూటర్‌లో వారి వివరాల నిక్షిప్తం చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. జగిత్యాల జిల్లా కలెక్టరేట్ వేదికగా 55 శాఖల నుంచి ఉద్యోగుల సమాచారం తెప్పించి కంప్యూటర్‌లో క్రోడీకరిస్తున్నారు. షెడ్యూల్ ఎప్పుడు విడుదలైనా అంతా సిద్ధం చేసుకుంటున్నారు. జగిత్యాల జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి.

వీటితో పాటు కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని కొడిమ్యాల, మల్యాల మండలాలు, సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్, బీమారం, మేడిపల్లి మండలాలున్నాయి. నిజామాబాద్ పార్లమెంటు పరిధిలో ఇప్పటికే పోలింగ్‌కు చెందిన రిసెప్షన్ కేంద్రాలను గుర్తించారు. తాజాగా ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే ఉద్యోగుల సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఇప్పటికే సగానికి పైగా శాఖల ఉద్యోగుల సమాచారాన్ని సిద్ధం చేశారు. ఇందుకోసం కలెక్టరేట్‌లో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.

55 శాఖలు.. 45 రకాల సమాచారం

పార్లమెంట్ ఎన్నికలకు అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. జిల్లా వ్యాప్తంగా అత్యవసర విభాగాలైన వైద్యం, అబ్కారీ, రవాణా, అగ్నిమాపక, పోలీసు విభాగాలు మినహా ఎన్నికల నిర్వహణకు 55 శాఖల సిబ్బంది వివరాలను సేకరిస్తున్నారు. పీవో, ఏపీవో, ఓపీవోల కోసం ఆయా శాఖల్లో పనిచేస్తున్న వారి వివరాలను సేకరిస్తున్నారు. బేసిక్‌పేను బట్టి ఎవరిని పీవోగా, ఏపీవోగా, ఓపీవోగా నియమించాలో నిర్ధారిస్తున్నారు.

ఏమైనా ఆరోగ్య సమస్యలు, గతంలో శాఖాపరంగా కేసులు, విచారణ వంటివి ఉన్నాయా అని ఆరా తీస్తున్నారు. బ్యాంకు ఖాతా వివరాలను సైతం తీసుకుంటున్నారు. శాఖల వారీగా వచ్చిన సమాచారం సరైందా.. కాదా అని కూడా వ్యక్తిగతంగా ఫోన్లు చేసి తెలుసుకుంటున్నారు. ఫిబ్రవరి 8న విడుదలైన ఓటరు జాబితా ప్రకారం ఉద్యోగుల ఎపిక్ నంబరు సహాయంతో పార్ట్ నంబరు, సీరియల్ నంబరు పోల్చిచూస్తున్నారు.

ఇచ్చిన సమాచారంలో ఏ చిన్న పొరపాటు దొర్లినా శాఖ అధిపతులనే బాధ్యులుగా చేస్తూ వారి నుంచి ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటు న్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొననున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించి 45 రకాల వివరాలను సేకరిస్తున్నారు. పుట్టిన తేదీ మొదలుకొని, తీసుకునే మూలవేత నం, సొంత నియోజకవర్గం, పనిచేస్తున్న జిల్లా, ఎపిక్ నంబరు, పోలింగ్ కేంద్రం, సెల్ ఫోన్ నంబరు వంటి వ్యక్తిగత సమాచారం క్రోడీకరిస్తూ ప్రతీఒక్కరికి ఫోన్లు చేస్తూ సమాచారాన్ని ధ్రువీకరించుకుంటున్నారు. అంతా పూర్తయ్యాక కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ప్రతీపోలింగ్ కేంద్రానికి ఐదుగురి చొప్పున సిబ్బందిని నియమిం చడానికి కసరత్తులు చేస్తున్నారు. అదనంగా మరో 20 శాతం మంది ఉద్యోగులను రిజర్వులో పెట్టేలా సమాచారం తీసుకుంటున్నారు. జిల్లాలు పోలింగ్ కేంద్రాలు, అవసరమైన సిబ్బంది తదితర వివరాలను సిద్ధం చేస్తున్నారు.



సమావేశానికి హాజరైన సెక్టోరల్ అధికారులు(ఫైల్)

ఎన్నికలకు 4,600 మంది ఉద్యోగులు..

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా సుమారు 4,600 మంది ఉద్యోగులు, సిబ్బంది అవసరమవుతారన్న అంచనా ఉంది. ఇందులో రిటర్నింగ్ అధికారి, పీవో ఏపీవోలు, ఇతర ఎన్నికల సిబ్బంది ఉంటారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా 785 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయను న్నారు. అదేవిధంగా సుమారు 400కుపైగా వాహనా లను ఎన్నికల కోసం ఉపయోగించడానికి అంచనా వేశారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం...

జిల్లాలో అర్హులైన వారందరినీ ఓటరు జాబితాలో చేర్చడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. యువతకు మరోమారు ఓటు నమోదుకు అవకాశం కల్పించారు. 2024 ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది. ప్రభుత్వ ప్రయివేటు డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల రెండు సార్లు ఓటరు నమోదుకు అవకాశం కల్పించారు. ఫిబ్రవరి 8వ తేదీన తుది ఓటరు జాబితా విడుదల చేశారు. కాగా జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాల్లో 7,08,481 ఓటర్లున్నారు. జిల్లాలో 7,08,481 మొత్తం ఓటర్లకు గానూ పురుషులు 3,40,448 మంది, స్త్రీలు 3,67,998 మంది, ఇతరులు 35 మంది ఉన్నట్లు ప్రకటించారు. అదేవిధంగా జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి 224 మంది సర్వీసు ఓటర్లుండగా ఇందులో 220 మంది పురుషులు, నలుగురు స్త్రీలు ఉన్నట్లు జాబితాలో పేర్కొన్నారు. ప్రస్తుతం మరోసారి నమోదుకు అవకాశం కల్పించిన నేపథ్యంలో యువత స్పందించాలని, తమ పేరును నమోదు చేసుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగం తహసీల్దార్ హకీం కోరుతున్నారు.

అదనపు కలెక్టర్‌గా పర్స రాంబాబు



జగిత్యాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు కలెక్టర్‌గా పర్స రాంబాబును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న అదనపు కలెక్టర్ బీఎస్ లతను సూర్యాపేట అదనపు కలెక్టర్‌గా, భద్రాద్రి కొత్తగూడెంలో పనిచేస్తున్న రాంబాబును జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్‌గా బదిలీ చేశారు. అదేవిధంగా జగిత్యాల ఆర్డీవో నర్సింహామూర్తిని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సమితి పరిపాలన అధికారిగా బదిలీ చేయగా, వేములవాడ ఆర్డీవోగా పనిచేస్తున్న పి మధుసూదన్‌ను జగిత్యాల ఆర్డీవోగా నియామకం చేశారు. కోరుట్ల ఆర్డీవో ఎస్ రాజేశ్వర్‌ను వేములవాడ ఆర్డీవోగా బదిలీ చేస్తూ, ఆయన స్థానంలో సిరిసిల్ల ఆర్డీవో ఆనంద్‌కుమార్‌ను కోరుట్ల ఆర్డీవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

జగిత్యాల రూరల్ ఎంపీపీగా మంగళారపు మహేష్



ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న మహేష్

జగిత్యాలరూరల్, ఫిబ్రవరి 28: జగిత్యాల రూరల్ ఎంపీపీగా బీఆర్ఎస్ పార్టీకి చెందిన నర్సింగాపూర్ ఎంపీటీసీ సభ్యుడు మంగళారపు మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలపరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి మదన్‌మోహన్ సమక్షంలో ఎంపీపీ కోసం ఎన్నిక నిర్వహించారు. అంతకుముందు బీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్ ఎంపీటీసీలకు విప్ జారీచేసిన పత్రాన్ని ఎన్నికల అధికారి మదన్‌మోహన్‌కు బీఆర్ఎస్ పార్టీ అందజేసింది. ఎంపీపీ ఎన్నిక కోసం మహేష్ ఒక్కరే నామినేషన్ వేయడంతో మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ఎన్నికల అధికారి మదన్‌మోహన్ ప్రకటించారు. ఎంపీపీగా ఎన్నికైనా మహేష్‌ను గుల్లపేట ఎంపీటీసీ దమ్మ సురేంధర్‌రెడ్డి ప్రతిపాదించగా, అంతర్గాం ఎంపీటీసీ శ్రీనివాస్ బలపర్చారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎంపీపీ మహేష్ మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జడ్పీచైర్‌పర్సన్ దావ వసంతసురేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీని శాలువాతో సత్కరించి ఎమ్మెల్యే, జడ్పీచైర్‌పర్సన్ అభినందించారు. అంతకు ముందు ఎంపీపీని మాజీ ఏఎంసీ చైర్మన్ కొలుగూరి దామోదర్‌రావు, ప్యాక్స్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు దావ సురేష్, రూరల్ మండల అధ్యక్షుడు బాలముకుందం ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రవిబాబు, సూపరింటెండెంట్ చౌడారపు గంగాధర్ పాల్గొన్నారు.

- **జగిత్యాల అర్బన్ ఎంపీపీ ఎన్నిక వాయిదా..**

జగిత్యాల అర్బన్ మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జగిత్యాల అర్బన్ మండల ఎంపీపీ ఎన్నిక వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి గౌతంరెడ్డి ప్రకటించారు. ఎంపీపీ అభ్యర్థిత్వానికి ఎలాంటి నామినేషన్ దాఖలు కాకపోవడంతో ఎన్నికను తాత్కాలికంగా వాయిదావేసి నట్లు తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీపీ ములాసపు లక్ష్మి ఎంపీటీసీ సభ్యులు రొక్కం రాజశేఖర్‌రెడ్డి, దమ్మ మల్లారెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సమావేశానికి హాజరయ్యారు.

జిల్లాలో మూడు లక్షల ఎకరాల్లో వరి సాగు



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి వాణి

మల్యాల, ఫిబ్రవరి 28: జిల్లాలో 3లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి బి.వాణి తెలిపారు. మండలంలోని గొర్రెగుండంలో వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం నాట్లు వేసి 60 రోజులు గడుస్తున్నందున రైతులు రెండో దఫా యూరియా, పొటాష్ వేయాలని సూచించారు. యాసంగి పంటకు ఆశించే అగ్గితెగులు నివారకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే రైతులు ప్రత్యామ్నయ పంటలను సాగు చేయాలని, ఆయిల్‌పామ్ సాగు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు ఏఈవో కె.ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారిని నియమించాలి

రాయికల్, ఫిబ్రవరి 28: రాయికల్ మున్సిపల్‌లో టౌన్ ప్లానింగ్ అధికారిని నియమించాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. టౌన్ ప్లానింగ్ అధికారి లేకపోవడంతో టీఎస్ బీపాస్‌లో ఇంటినిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారన్నారు.

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

కోరుట్ల, ఫిబ్రవరి 28: వచ్చే నెల 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతి కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. మున్సిల్, వైద్య, అంగన్‌వాడీ టీచర్లు, మెడికల్ అధికారులు, సూపర్‌వైజర్లు సమన్వయం చేసుకుని కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. వైద్యాధికారి అనిల్, హెల్త్ సూపర్‌వైజర్ ధనుంజయ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, సిబ్బంది ఉన్నారు.

సివిల్ ఆసుపత్రిలో ఉచిత అల్పాహారం

కోరుట్ల, ఫిబ్రవరి 28: పట్టణంలోని సివిల్ ఆసుపత్రిలో బుధవారం లయన్స్‌క్లబ్ 320 జి ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా ఉచిత అల్పాహారం అందించారు. మనోజ్‌కుమార్, రమ్య దంపతులు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో లయన్ ఉషాకిరణ్ అలిమెల్లి తదితరులు పాల్గొన్నారు.

రామమందిరం నిర్మిస్తే రామరాజ్యం వచ్చినట్టా?

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కుశ్రావణికి లేదు -టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు బండ శంకర్

జగిత్యాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రామమందిరం నిర్మాణం చేస్తే రామరాజ్యమే వచ్చినట్లుగా బీజేపీ నాయకులు మాట్లాడడం విడ్డూరంగా ఉందని టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు బండ శంకర్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ పాత్రను అద్భుతంగా గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ నాయకులే అసలు చరిత్ర తెలుసుకోవాలని హితవు పలికారు. స్వాతంత్ర్య సంగ్రామానికి ఆర్ఎస్ఎస్‌కు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఇతర పార్టీల నుంచి గెలిచిన ప్రజాప్రతినిధులను ప్రలోభపెట్టి, బీజేపీలో చేర్చుకుంటున్న నీచ చరిత్ర బీజేపీదేనన్నారు. పట్టణాభివృద్ధిని కాంక్షించి చైర్మన్‌గా గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ముచేసి ఎమ్మెల్యే పదవీకాంక్షతో మూడేళ్లకే రాజీనామా చేసి, బీఆర్ఎస్‌ను వీడి, బీజేపీలోకి చేరిన శ్రావణికి బీజేపీని విమర్శించే స్థాయి ఉందా అని ప్రశ్నించారు. మాజీ కౌన్సిలర్ పిప్పరి అనిత మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఎమ్మెల్యే డాక్టర్‌ను సంజయ్‌ను కీర్తించి, అర్వింద్‌ను విమర్శించిన సంగతి గుర్తుతెచ్చుకోవాలన్నారు. బీజేపీలో చేరి అర్వింద్‌కి జైకొట్టడం ఆమె స్వార్థ రాజకీయాలకు నిదర్శనం అన్నారు. అధికార దాహంతో ఐదేళ్ల పదవిని, మూడేళ్లకే రాజీనామా చేసి, ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన శ్రావణి, చివరకు ఎంపీగా పోటీ చేసేందుకు కూడా వెనుకడుగు వేయదన్నారు. జీవన్‌రెడ్డి ప్రజల్లోనే ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తారని, కానీ శ్రావణి మాత్రం సమస్యలు సృష్టిస్తారన్నారు. జీవన్‌రెడ్డి జోలికి వస్తే మహిళా కాంగ్రెస్ శ్రేణులు ఊరుకోరని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గుంటి జగదీశ్వర్, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, నెహాల్, మున్నా, చిట్ల లత తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

- ఒక్క నిమిషం నిబంధనతో ముందుగానే చేరుకున్న విద్యార్థులు - తొలిరోజు పరీక్షకు 325 మంది గైర్హాజరు







జగిత్యాలలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా, జగిత్యాల పట్టణంలో పరీక్ష రాసేందుకు కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు, మల్యాలలో హాల్‌టికెట్లు తనిఖీ చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 28: జిల్లాలో తొలిరోజు ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభం అయ్యాయి. ఒక్క సెకన్ నిబంధన అమలులో ఉండడంతో విద్యార్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. కాగా తొలిరోజు జనరల్ విద్యార్థులు 6,634 మందికి గానూ, 6,308 విద్యార్థులు హాజరవగా 226 మంది గైర్హాజరయ్యారు. వొకేషనల్ విద్యార్థులు 7,270 మందికి గానూ 6,945 విద్యార్థులు హాజరవగా 325 మంది గైర్హాజరైనట్లు ఇంటర్మీడియేట్ నోడల్ అధికారి నారాయణ తెలిపారు. ప్రశాంత వాతావరణంలోనే పరీక్షలు జరిగాయన్నారు. ప్రతీ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, పారదర్శకంగా పరీక్షల నిర్వహణ సాగుతుందన్నారు.

ధర్మపురి: ధర్మపురి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రారంభం అయ్యాయి. ఈ జూనియర్ కళాశాలలో కేవలం ఒకే ఒక సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ సెంటర్ నుంచి 291 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా కేవలం 285 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో కేవలం ఒకే ఒక విద్యార్థి ఒకేషనల్ కళాశాలకు చెందిన విద్యార్థి ఉన్నారు. ఆరుగురు విద్యార్థులు పరీక్ష రాయలేదు. ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పావని అనే విద్యార్థిని ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షకు ఆలస్యంగా రావడంతో అధికారులు పరీక్షలకు అనుమతించలేదు. పావని ధర్మపురిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్ఈసీ మొదటి సంవత్సరం చదువుతోంది. బుధవారం జరిగిన పరీక్షకు పది నిమిషాలు ఆలస్యంగా రావటంతో ఇన్విజిలేటర్ వెనక్కి పంపించారు. ఆ విద్యార్థిని ఎంత ప్రాధేయపడినప్పటికి పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వలేదు. దీంతో విద్యార్థిని నిరాశతో వెనుదిరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటలను జరుగకుండా ఎస్ఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

వెల్గటూర్: మండలంలోని కుమ్మరిపల్లి మాడల్ స్కూల్‌లో బుధవారం ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. 157 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 151 మంది విద్యార్థులు మాత్రమే తెలుగు పరీక్షకు హాజరు ఐనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తెలిపారు. దూర ప్రాంతంలో ఉన్న కొందరు విద్యార్థులు ఉరుకులు పరుగులు మీద పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. కాగా విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా పరీక్ష కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. డీవోగా సీహెచ్ గంగయ్య వ్యవహరించారు. ఎండపల్లి మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన గున్నాల సృష్టిత ఇంటర్‌మీడియట్ మొదటి సంవత్సరం సీఈసీ చదువుతోంది. బుధవారం తెలుగు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా అదే రోజు తన తాత గున్నాల రాజయ్య మృతి చెందాడు. ఓ వైపు తాత మృతదేహం, మరో వైపు పరీక్షలు ఏం చేయాలో తోచని పరిస్థితిలో కుటుంబీకులు, బంధువుల సలహాతో దుఃఖాన్ని దిగమింగుకొని పరీక్షకు హాజరైంది.

మల్యాల: మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. మొత్తం 420 మందికి గాను 413 విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ శివరామకృష్ణ తెలిపారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ మెదటి సంవత్సరం పరీక్షలకు 132 మంది విద్యార్థులకు గాను 130 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఇందూర తెలిపారు.

బీర్‌పూర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులు 93 మంది ఉండగా పరిక్షలకు 89 మంది హాజరయ్యారు. నలుగురు విద్యార్థులు గైరాజరైనట్లు అధికారులు తెలిపారు.

కథలాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 301 మందికి గాను 285 మంది పరీక్షకు హాజరయినట్లు ప్రిన్సిపాల్ గౌసుర్ రహమాన్ తెలిపారు. సిట్టింగ్ స్క్వాడ్‌గా రమేశ్‌బాబు, వేణు వ్యవహరించారు.







ధర్మపురిలో ఆలస్యంగా రావడంతో పరీక్ష రాయకుండానే వెనుదిరుగుతున్న విద్యార్థిని, పరుగులు తీస్తున్న విద్యార్థులు, కుమ్మరిపల్లిలో విద్యార్థినులు

మధ్యవర్తిత్వం చేస్తూ డబ్బులు వసూలు చేసిన వ్యక్తి అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 28: మధ్యవర్తిత్వం చేస్తూ డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని అరెస్ట్ చేశామని సిరిసిల్ల డీఎస్పీ భీంశర్మ తెలిపారు. బుధవారం అయన మాట్లాడుతూ ముస్తాబాద్ మండలానికి చెందిన లకావత్ శ్రీరామ్ అనే వ్యక్తి ఓ బాలికను వేధించిన విషయంలో ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో 2019లో ఫోక్సో కేసు నమోదైంది. ఆ కేసు కోర్టులో పెండింగ్ ఉన్నందున, లకావత్ చిన్న మున్నా నాయక్ అనే వ్యక్తి కేసు రాజీపడేలా మాట్లాడి పంచాయతీ చేస్తానని అన్నాడన్నారు. ఇందుకు లకావత్ శ్రీరామ్‌ను రూ. 1.80 లక్షలు డబ్బుల ఇవ్వాలని, డబ్బులు ఇస్తే కేసు రాజీ చేస్తానని డిమాండ్ చేసాడన్నారు. అతని డిమాండ్ మేరకు రూ 1.80 లక్షలు లకావత్ చిన్న మున్నా నాయక్ అనే వ్యక్తికి ఇచ్చాడన్నారు. ఆ డబ్బులు తీసుకొని పంచాయతీ చేయలేదని లకావత్ శ్రీరామ్ లకావత్ చిన్న మున్నాపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి చిన్నమున్నానాయక్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

భూకబ్జా కేసుల్లో మరో ఐదుగురిపై కేసు

● పలువురు కార్పొరేటర్ల భర్తలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 28: భూవివాదాలు సృష్టించి అక్రమంగా భూమి యజమానుల వద్ద నుంచి డబ్బులు దోపిడీకి పాల్పడటమే కాకుండా నిర్మాణాల కూల్చివేతకు పాల్పడిన ఐదుగురు నిందితులపై కరీంనగర్ రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. బుధవారం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కార్పొరేటర్ల భర్తలు ఎడ్ల అశోక్, తుల బాలయ్య, కాశెట్టి శ్రీనివాస్‌లను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచామని, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. కరీంనగర్ వివేకానందపురి కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మామిడి రవీందర్‌రెడ్డి తీగలగుట్టపల్లిలోని సర్వే నెంబరు 240ఏలో 744.97 చ.గ. స్థలాన్ని 2004 సంవత్సరంలో గోపడి సుగుణమ్మ, గోపడి రాజుల వద్ద కొనుగోలు చేశాడు. 2017లో గ్రామపంచాయతీ అనుమతితో ప్రహరీ, షెడ్ నిర్మించుకున్నాడు. ఇదే సర్వే నంబరులోని మూల అరుణాదేవి 26 ప్లాట్లు ఇంటిస్థలాలను విక్రయించగా వివిధ ప్రాంతాలకు చెందినవారు కొనుగోలు చేశారు. అయితే ఒక్కో ఇంటి స్థలం నుంచి 3 లక్షల రూపాయల వంతున ఇవ్వాలని రవీందర్‌రెడ్డిని కార్పొరేటర్ భర్త కాశెట్టి శ్రీనివాస్ బెదిరించాడు. అడిగిన డబ్బులు ఇవ్వనందున వారి ప్లాట్లకు వెళ్లే 40 అడుగుల రోడ్డు ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ అక్కడ శ్మశానవాటికగా స్థానికులను ప్రోత్సహించి అక్కడే శవాలను ఖననం చేయిస్తున్నారు. 2019జనవరి 2న కార్పొరేటర్ భర్త ఎడ్ల అశోక్, మాజీ వార్డు సభ్యుడు అల్లిబిల్లి నగేష్‌తో కలిసి రవీందర్‌రెడ్డి నిర్మించిన ప్రహరీ, షెడ్, గేట్‌లను ఎక్స్‌కావేటర్‌తో కూల్చివేయించారు.

కార్పొరేటర్ల భర్తలైన ఎడ్ల అశోక్, కాశెట్టి శ్రీనివాస్, తుల బాలయ్యలు రవీందర్‌రెడ్డిని పిలిపించి అక్కడి ప్లాట్ల యజమానులు ఒక్కొక్కరు రూ. 3 లక్షలు ఇవ్వాలని లేదంటే అక్కడే శ్మశానవాటికను నిర్మిస్తామని బెదిరించారు. దీంతో రవీందర్‌రెడ్డితో పాటు రాజమౌళి, రఘుపతిరెడ్డి తలా లక్ష రూపాయలు ఎడ్ల అశోక్‌కు ముట్టజెప్పారు. మిగతావారు డబ్బులు ఇవ్వలేదని 2020లో శివరాత్రి సమ్మయ్య ద్వారా ఎక్స్‌కావేటర్‌తో రోడ్డుపై గుంతలు తీయించారు. దీనిపై బాధితుల ఫిర్యాదుతో కరీంనగర్ రూరల్ ఠాణాలో ఐపీసీ సెక్షన్ 386, 452, 457, 506, 120-బి రెడ్‌విత్ 34 కింద నిందితులు ఐదుగురిపై బుధవారం కేసు నమోదు చేశారు. నిందితులు కార్పొరేటర్ల భర్తలు ఎడ్ల అశోక్, తుల బాలయ్య, కాశెట్టి శ్రీనివాస్‌లను అరెస్టు చేసి కరీంనగర్ ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా ప్రస్తుతానికి వారికి 41ఏ సీఆర్‌పీసీ కింద నోటీసులు ఇవ్వాలని న్యాయమూర్తి సూచించినట్లు పోలీసులు తెలిపారు.

మహా శివరాత్రి జాతర ఘనంగా నిర్వహించాలి

● రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ● వేములవాడలో జాతర ఏర్పాట్లపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్


ఆలయ పరిసరాలు పరిశీలిస్తున్న మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, ఫిబ్రవరి 28: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో మార్చి 7,8,9వ తేదీలలో జరుగునున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాలను ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. వేములవాడలో బుధవారం నిర్వహించిన మహాశివరాత్రి జాతర సమన్వయ సమావేశంలో ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మహాశివరాత్రి జాతర ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా జాతర నిర్వహించాల్సి ఉంటుందని, నిర్దేశించుకున్న పనులను జాతర ప్రారంభానికి ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. పూజలలో ఎలాంటి లోపాలు ఉండకుండా చూడాలని, శాస్త్రపరంగా స్వామి వారి పూజలు ఘనంగా జరగాలని, భక్తులకు త్వరగా దర్శనం లభించే విధంగా చర్యలు తీసుకోవాలని, జాతర నిర్వహణకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని సూచించారు. జాతర సందర్భంగా మార్చి 7 నుంచి మార్చి 9 వరకు వేములవాడకు ఎక్కువ బస్సు సర్వీసులు నడపాలని, మహాలక్ష్మి పథకం నేపథ్యంలో మహిళలకు ఉచిత ప్రయాణం ఉన్నందున అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని, భక్తుల రద్దీ ఆధారంగా ఆర్టీసీ అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ అవసరమైన మార్గాలలో అదనపు సర్వీసులు నడపాలని సూచించారు. అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలు, పొలాలలో రైతుల సహకారంతో పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. రోడ్ల పక్కన ఉన్న బావులకు ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆలయ పరిసరాలలో అపరిశుభ్రత కనిపించకుండా మూడు షిఫ్టులలో పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, భక్తుల కోసం ఎక్కడికక్కడ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రత్యేక దర్శనానికి రూ.300 రుసుం

మహాశివరాత్రి జాతర సందర్భంగా గతంలో అందించే ప్రత్యేక పాసులను పూర్తిస్థాయిలో రద్దు చేస్తున్నామని, వాటి స్థానంలో ప్రత్యేక దర్శనానికి రూ.300 టికెట్ ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. జాతర అనంతరం వేములవాడ క్షేత్రాన్ని శ్రీశైలం తరహాలో అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికబద్ధంగా ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటుందని మంత్రి తెలిపారు. వేములవాడలో సైతం బ్రేక్ దర్శనం అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. దాతల సహాయంతో భక్తుల కోసం 500 గదులతో అతిథి గృహాలను నిర్మించేందుకు ప్రణాళిక రూపొం దించాలని, దాతలకు కల్పించే సదుపాయాల అంశంలో శ్రీశైలం, తిరుపతిలో అవలంబించే విధానాలను అవలంబించాలని మంత్రి పేర్కొన్నారు. ఆలయ నిత్య అన్నదాన సత్రంలో సంఖ్యతో సంబంధం లేకుండా ఎంత మంది భక్తులు వచ్చినా ప్రతినిత్యం అన్నదానం చేయడానికి వీలుగా ఏర్పాట్లు చేయాలని ఇందుకోసం అవసరమైన నివేదిక రూపొందించాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేసే మహాశివరాత్రి జాతరను విజయవంతంగా చేయాలని, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడే విధంగా వేములవాడ పట్టణాన్ని సన్నద్ధం చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ మంత్రి, ప్రభుత్వ విప్ అందించిన సూచనలు పాటిస్తూ అధికారులు వివిధ శాఖల మధ్య ఉన్న చిన్న సమన్వయ లోపాలను పరిష్కరిం చుకొని పకడ్బందీగా జాతర నిర్వహించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. సమావేశం అనంతరం ఆలయ పరిసరాలు, జాతర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఎస్పీ నాగేంద్ర చారి, ఆలయ ఈఓ కృష్ణప్రసాద్, ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సీడీపీవో, ఇన్‌చార్జి సీడీపీవోలపై వేటు

మంథని, ఫిబ్రవరి 28: అక్రమాల ఆరోపణలు, ఫిర్యాదులు, విధుల దుర్వినియోగానికి పాల్పడిన మంథని ఐసీడీఎస్ సీడీపీవో, ఇన్‌చార్జి సీడీపీవోతో పాటు మరో సూపర్‌వైజర్‌పై జిల్లా కలెక్టర్ ముజమిల్‌ఖాన్ వేటు వేశారు. మంథని సీడీపీవోగా విధులు నిర్వహిస్తున్న పద్మశ్రీ, ప్రస్తుతం ఇన్‌చార్జి సీడీపీవో, రామగిరి సెక్టార్ సూపర్‌వైజర్ బండ రజితలను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు సరెండర్ చేస్తూ జిల్లా కలెక్టర్ ముజమిల్‌ఖాన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సుదీర్ఘ కాలంగా విధులు నిర్వహిస్తున్న మంథని ఐసీడీఎస్ సీడీపీవో పద్మశ్రీపై పలు ఆరోపణలు, ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వీటిపై స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో ఈ నెల 22వ తేదీన డీడబ్ల్యూవో, 26వ తేదీన వరంగల్ ఆర్‌డీజేలు విచారణ నిర్వహించారు. విచారణ అనంతరం పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులకు సమర్పించారు. ఈ మేరకు మంథని ఐసీడీఎస్ సీడీపీవో పద్మశ్రీ విధులు సరిగా నిర్వహించలేదని, ఇన్‌చార్జి సీడీపీవో, రామగిరి సెక్టార్ సూపర్‌వైజర్ బండ రజితలు తమ విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, కార్యాలయ సమాచారాన్ని బయట పరిచిందని పేర్కొంటూ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు సరెండర్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గుంజపడుగు సెక్టార్ సూపర్ వైజర్‌గా విధులు నిర్వహి స్తున్న గండు సరిత ఇన్‌చార్జి సీడీపీవోకు సహకరించిందని పేర్కొంటూ షోకాజ్ నోటీసు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఐసీడీఎస్ ఆఫీసులో కొనసాగుతున్న ఫిర్యాదులు, విచారణలకు తాత్కాలికంగా బ్రేక్ పడే అవకాశం ఉంది.

సంఘ బహిష్కరణపై కేసు

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 28 : పట్టణంలోని మోచి సంఘం రెండు వర్గాలుగా విడిపోయి ఒక వర్గానికి చెందిన మోచి సంఘ కుల పెద్దమనుషులు మరో వర్గానికి చెందిన కుల సభ్యులను సామూహిక సంఘ బహిష్కరణ చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. ఉమ్మడిగా ఉన్న ఆస్తులను కులానికి చెందిన కొందరు ఆస్తులన్నీ తమవేనని ప్రచారం చేస్తూ మరో వర్గానికి సంఘం నుంచి బహిష్కరించినట్లు ప్రచారం చేస్తూ సంఘం ఆస్తుల్లో భాగస్వామ్యం లేదంటున్నారని సంఘానికి చెందిన కావల్ల పెంటయ్య తండ్రి లింగయ్య, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో వృద్ధుడి ఆత్మహత్య

కొడిమ్యాల, ఫిబ్రవరి 28: మండలంలోని నమిలికొండ గ్రామానికి చెందిన బొలుమాల దేవయ్య(61)బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు దేవయ్య అనారోగ్యంతో పాటు అప్పుల బాధలు భరించలేక వెటర్నరీ సెంటర్‌లోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుని కుమారుడు బొలుమాల సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కత్తితో తండ్రిపై దాడి

మెట్‌పల్లి, ఫిబ్రవరి 28: మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన ఆరపేటలో కుటుంబ కలహాలతో తండ్రిపై కత్తితో దాడి చేసిన తనయుడి సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... ఆరపేట గ్రామానికి చెందిన రిత్వం కుమారుడు అయిన అక్బర్‌ఖాన్ కొంత కాలం వివాహం చేసుకున్న తర్వాత వేరు కాపురం పెట్టుకొని ఉంటున్నారు. కొన్ని రోజుల నుంచి అక్బర్ ఖాన్‌కు భార్యతో మనస్పర్థలు రావడంతో ఆమె తల్లిదండ్రుల వద్ద వెళ్లి ఉంటోంది. అప్పటి నుంచి తాగుడుకు బానిసై నా భార్య నాకు కావాలని అక్బర్‌ఖాన్ బుధవారం తల్లిదండ్రులపై గొడవకు దిగి తల్లిని కత్తితో పొడిచే క్రమంలో తండ్రి రిజ్వాన్‌ఖాన్ అడ్డుగా వచ్చాడు. అడ్డుగా వచ్చిన రిజ్వాన్‌పై దాడికి పాల్పడటంతో గాయపడిన రిజ్వాన్‌ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రిజ్వాన్‌ఖాన్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అక్బర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వలస కూలి ఆత్మహత్య

మల్లాపూర్, ఫిబ్రవరి, 28: గత తొమ్మిదేళ్ల క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి జీవనోపాధి నిమిత్తం మండలంలోని రత్నపూర్ గ్రామానికి వచ్చిన పెడికం వెంకటేష్(38) అనే వలస కూలి తాగుడుకు బానిసై జీవితంపై విరక్తి చెంది బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు బుధవారం మల్లాపూర్ పోలీసులు తెలిపారు. మృతుడి భార్య పెడికం గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు.

రాముడి జన్మస్థలం గురించి మాట్లాడినట్లు నిరూపిస్తారా?

● బండి సంజయ్ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డ మంత్రి పొన్నం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 28: రాముని జన్మస్థలం ఎక్కడ, రాముని అక్షింతలు ఎక్కడివి అని తాను మాట్లాడినట్లు ఎంపీ బండి సంజయ్ ప్రచారం చేస్తున్నాడని వాటిని సాక్ష్యాలతో నిరూపిస్తే సజీవ దహనానికి కూడా సిద్ధమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి శ్రీలక్ష్మీనర్సింహాస్వామి వారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు రాజన్న ఆలయ ఈవో కృష్ణప్రసాద్ పూర్ణాహుతితో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి వారి ప్రత్యేక పూజలో పాల్గొన్న ఆయనకు ఆలయ అర్చకులు రామాచారి, విజయేంద్ర చారీలు ఆశీర్వచనం గావించగా ఆలయాధికారులు శ్రీస్వామి వారి శేషవస్త్రాన్ని కప్పి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం విలేకర్లతో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్‌ర్యాలీలో భాగంగా బండి సంజయ్‌కుమార్ రాముడు జన్మస్థలం ఎక్కడని, రాముని అక్షింతలు ఎక్కడివని అసలు ఈ ఎమ్మెల్యే తన అమ్మకే పుట్టాడా.. అని తన అమ్మను ఉద్దేశించి మాట్లాడిన తీరుపై విరుచు కుపడ్డారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వున్న తల్లులను, బీజేపీ పార్టీ అధిష్టానాన్ని ఒక్కటే కోరుతున్నానని, బండి సంజయ్ అన్న మాటలకు నా తల్లి రోధిస్తుందని భావోద్వేగానికి లోనయ్యారు. బిడ్డా నా తల్లి గురించి మాట్లాడావు జాగ్రత్త అని హెచ్చరించారు. ఆవేదనతో చెబుతున్న రాత్రంతా నిద్రపోలేదని అన్నారు. మళ్లీ పేపర్లలో, వాట్సప్‌లలో అమ్మ పేరుతో రాజకీయం చేస్తున్నావని నన్నే అంటున్నాడు. నేను నీలాగే రాజకీయాలు చేస్తున్నాను నాకు స్థానిక మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబుతో నాకు రాజకీయంగా శత్రుత్వం ఉంది, కానీ ఏ రోజు కూడా వాళ్ల కుటుంబ సభ్యుల గురించి మాట్లాడలేదని గుర్తు చేశారు. నేను ఒక హిందువునని, నేను భక్తుడినని, నేను మాత్రం బండి సంజయ్‌లాగా మాంసాహారం తినను అని ఎద్దేవా చేశారు. రాముడి జన్మస్థలం ఎక్కడ అని ప్రచారం చేస్తున్నారు. రాముని జన్మస్థలం గురించి అడిగే మూర్ఖుడు ఉంటాడా అని ప్రశ్నించారు. ఒకవేల నేను అని ఉంటే మీడియా చూస్తూ ఊరుకుంటుందా.. అని గుర్తు చేశారు. రామున్ని ఓట్ల రూపకంలో వాడుకుంటుంది మీరని, రాముని అంశంతో రాజకీయం చేస్తున్న మూర్ఖులు మీరని మండిపడ్డారు. ఎంపీగా చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు చెప్పాలన్నారు. రోడ్లు, ఉపాధి హామీ పనులు తప్ప నిర్మాణాత్మక పనులు ఏమి చేశావో చెప్పాలన్నారు. హిందువునని చెప్పుకునే నీవు ఎంపీగా వేములవాడ క్షేత్రానికి ఏమి చేశావని నిలదీశారు. రాముని పేరుతో రాజకీయం చేసుడు, మత పరమైన అంశాలను రెచ్చగొట్టడమే పనిగా పెట్టుకుని పబ్బం గడుపుతున్నావని విమర్శించారు. గత ఎంపీ ఎన్నికల సమయంలో నేను కూడా హిందువునే, నేను యజ్ఞాలు చేస్తాను, నేను భక్తున్నే వాడేవడు, వీడేవడు, ఈ హిందుగాళ్లు.. బొందుగాళ్లు అని కేసీఆర్ అన్న మాటలను సాకుగా చూపి ఎంపీగా గెలిచావని ఆరోపించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న నువ్వు కరీంనగర్ ఎమ్మెల్యేగా మూడుసార్లు ఓడిపోయిన నువ్వు నన్ను రాజీనామా చేయమంటావా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గంగుల కమలాకర్‌తో కుమ్మక్కై కావాలని ఎమ్మెల్యేగా ఓడిపోయి మళ్లీ వాడో వీడో అంటూ నోటికి వచ్చిన మాటలు మాట్లాడి సానుభూతి తెచ్చుకోవాలని చూసే నీ రాజకీయ రంగు ప్రజలు గ్రహిస్తున్నారని పేర్కొన్నారు. భార్య మంగళసూత్రం విలువ తెలువని నువ్వు నా గురించి మాట్లాడుతావా అంటూ మండిపడ్డారు. వారి వెంట ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఎస్పీ నాగేంద్రచారి, తహసీల్దార్ మహేష్‌కుమార్ స్థానిక నాయకులు ఉన్నారు.


కొడుముంజలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణ భూమిపూజ చేస్తున్న మంత్రి పొన్నం

ఆలయాల నిర్మాణానికి భూమి పూజ

వేములవాడ మండలం కొడుముంజ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లిన పొన్నం ప్రభాకర్ ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాజీ సర్పంచ్‌లు కదిరే రాజ్‌కుమార్, పండుగ ప్రదీప్, నాయకులు పిల్లి కనుకయ్య, ఎర్రం రాజు, చింతపల్లి శ్రీనివాస్‌రావు తదితరులు ఉన్నారు.

పని కల్పించాలని రోడ్డెక్కిన పవర్‌లూం నేత కార్మికులు


సిరిసిల్లలో పవర్‌లూం కార్మికుల ర్యాలీ


సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నేతన్నలకు పని కల్పించాలని, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని నివారించాలని, ప్రభుత్వ ఆర్డర్లు తక్షణమే ఇవ్వాలంటూ సిరిసిల్ల నేత కార్మికులు రోడ్డెక్కారు. బుధవారం సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి సీఐటీయూ, పవర్‌లూం వర్కర్స్ యూనియన్ అసాముల సమన్వయ కమిటీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ, మహాధర్నా నిర్వహించారు. చేనేత విగ్రహానికి పూలమాల వేసి అంబేద్కర్ చౌరస్తాకు చేరుకొని మానవహారంగా ఏర్పడ్డారు. ధర్నా నిర్వహించి ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర సంక్షోభాన్ని నివారించడంతో పాటు తక్షణమే బతుకమ్మ చీరలు, ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని పెండింగ్ బకాయిలను సబ్సిడీ డబ్బులు, విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్‌లు మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని అన్నారు. ఉపాధి లేక పవర్‌లూం కార్మికులు, అసాములు వైపని, వార్పిన్ కార్మికులు, గుమస్తాలు, జాపర్లు, అనుబంధ రంగాల కార్మికులు రోడ్డున పడ్డారని అన్నారు. గత ప్రభుత్వం బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేయించిందని వాటికి సంబంధించిన బకాయిలు, యారన్ సబ్సిడీ బకాయిలు చెల్లించలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా టెస్కోకు చెల్లించాల్సిన రూ 482 కోట్లు చెల్లించలేదన్నారు. సిరిసిల్లకు రూ.200 కోట్లు బకాయిలు వెంటనే విడుదల చేయాలని అన్నారు. ప్రతిపక్ష హోదాలో ఉన్న సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పోరాటాలకు కలిసి రావాలన్నారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్ కార్మికుల కోసం పార్లమెంట్‌లో ఒక్కసారైనా నోరు మెదపలేదని అన్నారు. పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, అసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవి తదితరులున్నారు.

ఉద్యోగాల పేరిట రూ. 9 లక్షల టోకరా

- ఇద్దరిపై కేసు నమోదు

గంభీరావుపేట, ఫిబ్రవరి 28: అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిట నిరుద్యోగ యువకుల నుంచి గంభీరావుపేట మండలంలో ఇద్దరు వ్యక్తులు రూ.9 లక్షలు వసూలు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఎర్రపల్లికి చెందిన అర్జున్, గర్జనపల్లికి చెందిన రాజు అనే ఇద్దరు వ్యక్తులు పలు ప్రాంతాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిటా ఏడుగురు యువకుల నుంచి రూ.9 లక్షల వరకు వసూలు చేశారు. డబ్బులు ఇచ్చి నెలలు గడుస్తున్నా ఎలాంటి ఉద్యోగాలు రాకపోవడంతో అనుమానం వచ్చిన బాధితులు వారిద్దరిని నిలదీశారు. గంభీరావుపేట మండలంలోని జగదాం బతండాకు చెందిన అజ్మీరా రమేష్ స్థానిక పోలీస్‌లను ఆశ్రయించాడు. రమేష్ ఫిర్యాదు మేరకు వారిని అదుపులోకి తీసుకుని విచారించగా ఏడుగురు యువకుల వద్ద ఉద్యోగాల పేరుతో రూ. 9 లక్షలు వసూలు చేసినట్టు రాజు, అర్జున్‌లు ఒప్పుకున్నారు. బాధితుడు రమేష్ ఫిర్యాదు మేరకు రాజు, అర్జున్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు. ఉద్యోగాల పేరిట నిరుద్యోగ యువకులు ఎవరైనా డబ్బులు అడిగితే తమ దృష్టికి తేవాలని ఎస్‌ఐ రాంమోహన్ వెల్లడించారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్రలను తిప్పి కొట్టాలి


కరపత్రం ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

సిరిసిల్ల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై పెద్దపల్లి జడ్పీ ఛైర్మన్ పుట్ట మధు ప్రచురించిన కరపత్రాన్ని బుధవారం గంభీరావుపేట మండలం మల్లుపల్లెలో కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసం కాంగ్రెస్ కాళేశ్వరం ప్రాజెక్టును కూల్చే కుట్ర పన్నుతోందన్నారు. మేడిగడ్డలో కుంగిన మూడు పిల్లర్లకు మరమ్మతు చేసి ప్రాజెక్టును పునరుద్ధరణ చేపట్టాల్సిన ప్రభుత్వం అసత్య ఆరోపణలతో బీఆర్‌ఎస్‌ను బదనాం చేసే కుట్ర పన్నుతోందన్నారు. ప్రపంచంలోనే నంబర్ వన్ ప్రాజెక్టుగా పేరుగాంచిన కాళేశ్వరం ప్రాజెక్టులో ఏర్పడిన చిన్న చిన్న సాంకేతిక లోపాలను భూతద్ధంలో చూపిస్తూ ప్రాజెక్ట్ ప్రతిష్టను మంటగలుపుతోందన్నారు. ఓట్ల కోసం రైతుల నోట్లో మట్టి కొట్టే పనులు మానుకోవాలని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నిజనిజాలను ప్రజలకు వివరించేందుకు మార్చి 1న చలో కాళేశ్వరం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. పెద్దపల్లి జడ్పీ ఛైర్మన్ మధుకర్ కాళేశ్వరం ప్రాజెక్టుపై రూపొందించిన కరపత్రాన్ని చదివితే పూర్తిగా అర్థమవుతుందన్నారు.కార్యక్రమంలో జడ్పీ ఛైర్పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ గూడూరి ప్రవీణ్, జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహజ్యోతి : ఎస్‌ఈ

గణేష్‌నగర్, ఫిబ్రవరి 28: ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు గృహజ్యోతి పథకం వర్తిస్తుందని ఎస్‌ఈ గంగాధర్ తెలిపారు. లబ్ధిదారులు ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో విద్యుత్ కనెక్షన్ నెంబర్, తెల్లరేషన్ కార్డు, ఆధార్‌కార్డుతో కలిపి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వారు ఆందోళన చెందవద్దని, అధికారులకు సమర్పించిన దరఖాస్తులు ధ్రువీకరించిన తర్వాత నమోదు చేస్తారన్నారు. అర్హులైన వారందరికీ జీరో బిల్ అందజేస్తామన్నారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటే పరిశీలన అయ్యేంత వరకు విద్యుత్ సిబ్బంది బిల్లు వసూలుపై చర్యలు తీసుకోరన్నారు.

భూ కబ్జాలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 28: భూ కబ్జాలకు పాల్పడిన తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన పెద్దూరు తిరుపతి అనే వ్యక్తిని బుధవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. 1996లో తంగళ్లపల్లి మండలానికి చెందిన గజభింకర్ రాధాభాయి 1996లో 20గుంటల భూమిని కొని రిజిస్ట్రేషన్ చేసుకుందన్నారు. ఈ భూమిని పెద్దూరు తిరుపతి అనే వ్యక్తి బెదిరించి ఆక్రమించుకున్నాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు తిరుపతిపై తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని తెలిపారు. అమాయక ప్రజలను బెదిరిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తూ కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్ అరెస్టు

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 28: వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయపల్లి గ్రామంలో గల్ఫ్ దేశాలకు పంపిస్తానని మోసం చేస్తున్న వ్యక్తిని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడ టౌన్ సీఐ కరుణాకర్ వెల్లడించారు. బోయినపల్లి మండల కేంద్రానికి చెందిన పెగ్గెర్ల చంద్రశేఖర్ కోనాయపల్లి గ్రామంలో కార్యలయం ఏర్పాటు చేసుకుని అమాయకులను మోసం చేస్తున్నాడని తెలిపారు. కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన మల్యాల దర్గయ్య అనే వ్యక్తిని ఉపాధి నిమిత్తం ఉక్రెయిన్‌కు పంపిస్తానని, నెలకు లక్ష జీతం వస్తుందని నమ్మించి రూ.2 లక్షల 75 వేలు తీసుకుని, మోసం చేసినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

తిరుమల శ్రీవారి సన్నిధిలో ప్రభుత్వ విప్ 'అడ్లూరి'



మాట్లాడుతున్న విప్,ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఫిబ్రవరి 28: తిరుమల వేంక టేశ్వర స్వామి వారిని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం సందర్శించారు. ధర్మపురి ఎమ్మె ల్యేగా గెలిచిన తరువాత మొదటిసారిగా తిరుమల వేంకటేశ్వరస్వామి వారిని అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకున్నారు. ఎమ్మెల్యేగా గెలిచి, ప్రభు త్వ విప్‌గా హోదాలో స్వామి వారిని దర్శనం చేసుకోవటం ఆనందంగా ఉందన్నారు. భగవంతుడి ఆశీర్వాదం వల్ల ఇటీవల తాను రోడ్డు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడినట్లు ఆయన వివరించారు. గతంలో కేసీఆర్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదని ఆయన ఆరోపించారు. రాబో యే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు పార్టీ పక్షాన ఉండి కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తారని ఆయన తెలిపారు.

పెగడపల్లి రాజన్న ఆలయంలో పోస్టర్ ఆవిష్కరణ

పెగడపల్లి, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆలయకమిటీ ఆధ్వర్యంలో మహాశివ రాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. మార్చి 8న మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆలయంలో మార్చి 6 నుంచి 9వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలు జరుగనుండగా ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను రాజరాజేశ్వర ఆటో యూనియన్ సహకారంతో ముద్రించగా శివదీక్షాపరులు, నాయకులు, కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ గంగారెడ్డి, పోచమల్లు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు బొమ్మెన స్వామి, రాజశేఖర్, రమేష్, నర్సింహారెడ్డి, తిరుపతి రెడ్డి, వెంకట్ రావు, కొమురెల్లి, పార్థసారథి పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు

రాయికల్, ఫిబ్రవరి 28: రాయికల్ పట్టణంలో మేరు సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డే వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కులదైవం శ్రీ శంకర దాశమయ్యకు పూలు నిర్వహించారు. సంఘ అభివృద్ధికి సహకరించి ఐక్యంగా ఉండి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సింగు వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి కొట్టూరి రమేష్, సింగు నరేందర్, శాంతయ్య, పెద్ద నర్సయ్య, సుదర్శన్, శివ, గంగనర్సయ్య, సభ్యులు పాల్గొన్నారు.

మల్యాల: మల్యాల మండల కేంద్రంలో టైలర్స్‌డే వేడుకలను టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలే సంజీవ్, పేంటుకర్ శ్రీధర్, రామగిరి మురళి, గౌరయ్య, గంగాధర్, దుంపేటి నరేష్, నగేష్, సత్తయ్య, సత్యం, అశోక్, కనకరాజం, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని మేరు సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డేను పురస్కరించుకొని కేక్‌కట్ చేసి బుధవారం వేడుకలను జరుపుకు న్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దీకొండ గంగాధర్, నర్సయ్య, సత్యం, నారాయణ, గంగారాం, నర్సింగరావు, జనార్దన్, స్వామి, వెంకటి, దేవదాస్, చంద్రశేఖర్, అశోక్, శ్రీనివాస్, రమణ సంతోష్ ఉన్నారు.

బదిలీపై వెళ్లిన కమిషనర్‌కు సన్మానం

రాయికల్, ఫిబ్రవరి 28: రాయికల్ పట్టణంలో మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన గంగుల సంతోష్ కుమార్‌ను పట్టణ కాంగ్రెస్ నాయకులు బుధవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అల్లీపూర్ మాజీ సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, రాయికల్ మాజీ ఉప సర్పంచ్ బాపురపు నర్సయ్య, వార్డు సభ్యుడు పొన్నం శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వీడ్కోలు హంగామా

రాయికల్, ఫిబ్రవరి 28: మండలంలోని తాట్లవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలతో హంగామా చేశారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కంది రంజిత్ పరీక్షలు రాసే పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బోగ రమేష్, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, రవీందర్, లావణ్య, సాగరిక, శ్రీధర్, శ్రీదేవి, చంద్రకళ, రవి కుమార్, పరమేశ్వర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం పదవ తరగతి విద్యార్థులకు తొమ్మిదవ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. ఐదేళ్ళు కలిసి చదువుకున్న తమ నుంచి దూరమవుతున్న విద్యార్థులతో జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యార్థులు వివిధ పాటలకు నృత్యాలు చేయగా వీడ్కోలు హంగామా చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తాటికొండ నరేశ్ మాట్లాడుతూ బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

జగిత్యాల పట్టణ సీఐగా ఎస్ వేణుగోపాల్



జగిత్యాల, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ సీఐగా రామగుండం ఐటీకోర్‌లో పనిచేస్తున్న సూరం వేణుగోపాల్‌ను నియమిస్తూ బుధవారం ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జగిత్యాల సీఐగా పనిచేసిన నటేష్‌పై పలు అవినీతి ఆరోపణలు రావడంతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో వేణుగోపాల్ నియమించారు.

సీఎం, విప్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

వెల్గటూర్, ఫిబ్రవరి 28: మరో రెండు గ్యారంటీ పథకాలకు కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిన నేపథ్యంలో మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చిత్రపటాలకు బుధవారం కాంగ్రెస్ నాయకులు క్షీరా భిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత గృహ విద్యుత్, రూ.500లకు గ్యాస్ సిలిండర్ గ్యారంటీ పథకాలను ప్రారంభించిన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మేరుగు మురళి, అనుమాల మంజుల, సందీప్‌రెడ్డి, శ్రీకాంత్‌రావు, పూదరి రమేష్, బందెల ఉదయ్, నరేష్, గుమ్ముల వెంకటేష్, సత్యం, శ్రావణ్‌రెడ్డి, రవి, తిరుపతి, భూమయ్య, వెంకటస్వామి, జితేందర్‌రెడ్డి, నర్సయ్య, మల్లేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం మరో రెండు పథకాలు, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్ పథకాలను ప్రారంభించడంతో బుధవారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, కృష్ణారావుల చిత్ర పటాలకు పాలభిషేకం జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీలు పోనకంటి చిన్న వెంకట్, జలేష్, రాములు కాంగ్రెస్ నాయకులు రాజేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

బీర్‌పూర్, ఫిబ్రవరి 28: బీర్‌పూర్ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవం గురువారం సాయంత్రం జరుగనుంది. రథోత్సవం సందర్భంగా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. బుధవారం ఆలయ అర్చకులు స్వామి వారి సన్నిధిలో వేద సదస్సు కార్యక్రమాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేష్, కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, ఆలయ చైర్మన్ ఎనగంటి సామ్రాట్, ఈవో సంకటాల శ్రీనివాస్, అర్చకులు సంతోష్, మధు కుమార్, సంతోష్, సిబ్బంది రాజయ్య, వెంకటేష్, ఉత్సవకమిటి ధర్మకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం



కోరుట్లలోని కేరళ పాఠశాలలో సైన్స్ డే ఉత్సవాలు



ధర్మపురి మండలం దొనూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..

జగిత్యాల అర్బన్, ఫిబ్రవరి 28: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు పాఠశాలల్లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. జగిత్యాలలోని స్థానిక బైపాస్ రోడ్‌లో గల తపోవన్ పాఠశాలలో విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాల్లోని పలు ప్రయోగాలను సొంతంగా తయారు చేసి ప్రదర్శించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించి, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అనుమల్ల శ్యాం, ప్రిన్సిపాల్ శ్వేత, ఉపాధ్యాయులు రాజేష్, మాధవి తదితరులున్నారు.

రాయికల్: పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను తహసీల్దార్ ఖయ్యూం, మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలె శేఖర్‌జయశ్రీ, అకాడమీ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తాట్లవాయి ఉన్నత పాఠశాల, ఇటిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మూటపెల్లి ఉన్నత పాఠశాల, రాయికల్ పట్టణంలోని వివేకవర్ధిని పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఇటిక్యాల ఆదర్శ పాఠశాల, భూపతిపూర్ ఉన్నత పాఠశాల, మూటపెల్లి ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సైన్స్ ఫేర్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో భౌతిక, రసాయన శాస్త్ర, జీవశాస్త్ర చిత్రాలను రంగులతో వేసి ప్రదర్శించారు. కార్యక్రమాల్లో మాజీ సర్పంచులు బెక్కం తిరుపతి, జక్కుల చంద్రశేఖర్, మాజీ విద్యా కమిటీ అధ్యక్షుడు కొడిమ్యాల శంకర్, సంగెం రమేష్, ప్రధానోపాధ్యాయులు బోగ రమేష్, శ్రీపతి రాఘవులు, యూవీ రమణి, ప్రిన్సిపాల్ శ్రీధర్, వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు ముత్యం రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్యాల: సీవీ రామన్ జయంతి సందర్భంగా మండలంలోని పలు ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్‌డేను నిర్వహించారు. విద్యార్థులు రుపొందించిన పలు పరికరాలను ప్రదర్శించారు. విద్యార్థులు సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలని ఈ సందర్భంగా పలువురు అన్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు తమ సృజనాత్మకతతో రుపొందించిన వివిధ సైన్స్ పరికరాలు ఆకట్టుకున్నాయి.

కోరుట్ల: పట్టణంలోని గౌతం స్కూల్, కేరళ సూల్, రైజింగ్ స్కూల్, ఎఖీన్‌పూర్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు స్వయంగా తయారు చేసిన సైన్స్ పరికరాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, కరస్పాండెంట్లు మాట్లాడుతూ సైన్స్ దేశపురోగతికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తి వెలికి వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో కరస్పాండెంట్లు గఫార్, రాజేంద్రప్రసాద్, ఎంపబారి, ప్రిన్సిపాళ్ళు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్: పోటీలతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందని ప్రిన్సిపాల్ నాంపెల్లి కృష్ణప్రసాద్ రవీందర్ అన్నారు. బచ్‌పన్ ప్లే స్కూల్, వెల్లుల్ల ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు సైన్స్ పరికరాలను తయారుచేసి వాటి గురించి తోటి విద్యార్థులకు వివరించారు. ప్రదర్శనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇదే ఉత్సాహంతో చదువులో రాణించాలని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మపురి: జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా దొనూర్, దొంతాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో, ధర్మపురి శ్రీవాణి విద్యాలయం విద్యార్థులు సైన్స్ పరికరాలు, పలు రకాల సైన్స్ వర్కింగ్ మోడల్స్‌ను తయారు చేశారు. దొనూర్ పాఠశాలలో మూఢనమ్మకాలు, పర్యావరణ కాలుష్యానికి సంబంధించిన వివిధ ప్రాజెక్టులు రూపొందించారు. దొంతాపూర్ పాఠశాలలో రక్త సరఫరా నమూనా, మానవ శ్వాస వ్యవస్థ నమూనా, గాలి, నీటి పీడనాలు, రహదారి నియమాలు, దాదాపు 60 రకాల నమూనాలు తిలకించి అభినందించారు. ధర్మపురి శ్రీవాణి విద్యాలయం విద్యార్థులు ఇస్రో సాధించిన చంద్రయాన్ 3 ప్రయోగ నమూనాలతో పాటు పర్యావరణ కాలుష్యానికి సంబంధించిన ప్రాజెక్టులు, మానవ శ్వాసకోశ నమూనాలు, వివిధ రకాల ఎకో ఫ్రెండ్లీ నమూనాలను తిలకించారు. అంతకుముందు ఆయా పాఠశాలల్లో సీవీ రామన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, వైద్యుడు ఇందారపు రామకృష్ణ, హెచ్‌ఎంలు కాశెట్టి రమేష్, భట్టారి రాజేశం, కె. ప్రభాకర్, గట్ల శ్రీనివాస్, డైరెక్టర్ సంగనభట్ల దినేష్, కౌన్సిలర్ సంగనభట్ల సంతోషి, ఎస్ కన్నంనాయుడు, దావన్‌పెల్లి రమేష్, మాదాసు రజిత, గజెల్లి సునీత, బండారి సతీష్, చుంచుకాల సింధూజ, అనూష లలితజ్యోతి, సోనియా, నందిని పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని విద్యార్థులు వివిధ పాఠ్యాంశాలకు సంబంధించి సైన్స్ మేళా నిర్వహించి వాటి ఉపయోగాలను వివరించారు. సైన్స్ వల్ల దేశ ప్రయోజనాలు కాపాడబడతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.






వెల్లుల్లలోని ప్రభుత్వ పాఠశాలలో పరికరాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, మూటపెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో, జగిత్యాలలోని తపోవన్ పాఠశాలలో వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, గంభీర్‌పూర్‌లో..

మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థి జ్యోతి

- కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం, ఫార్వర్డ్ బ్లాక్ మద్దతుతో విజయం - సంబరాలు చేసుకున్న అడువాల జ్యోతి వర్గీయులు




మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన అడువాల జ్యోతి, హాజరైన కౌన్సిలర్లు, ఎమ్మెల్యే



బాధ్యతలు స్వీకరిస్తున్న జ్యోతి

జగిత్యాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థిగా పోటీ చేసిన అడువాల జ్యోతి ఎన్నికయ్యారు. చైర్‌పర్సన్ బోగ శ్రావణి యేడాది క్రితం రాజీనామా చేశారు. దీంతో ఖాళీగా ఉన్న పదవికి బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జడ్పీ సీఈవో గౌతంరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికను నిర్వహించారు. బీఆర్ఎస్ అధిష్ఠానం నిర్ణయం మేరకు 39వ వార్డు కౌన్సిలర్ సమిండ్ల వాణి పోటీ చేయగా, బీఆర్ఎస్ తిరుగుబాటు అభ్యర్థిగా 36వ వార్డు కౌన్సిలర్ అడువాల జ్యోతి పోటీ చేశారు. ఈ ఎన్నికలో 46 మంది కౌన్సిలర్లతో పాటు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థి అడువాల జ్యోతికి కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆరుగురు, బీజేపీకి చెందిన ఇద్దరు, ఏఎంఐఎం, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్‌కు చెందిన ఒక్కొక్కరు, స్వతంత్ర కౌన్సిలర్లు ఐదుగురు, బీఆర్ఎస్ కౌన్సిలర్లు తొమ్మిది మంది మద్దతు తెలపడంతో 24 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ అభ్యర్థి సమిండ్ల వాణికి బీఆర్ఎస్ కౌన్సిలర్లు 19 మంది, బీజేపీ, స్వతంత్ర, కాంగ్రెస్‌కు చెందిన కౌన్సిలర్లు ఒక్కొక్కరు, ఎక్స్‌అఫీషియో సభ్యుడు ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ మద్దతు పలకడంతో 23 ఓట్లు వచ్చాయి. చేతులు ఎత్తే పద్ధతిలో ఓటింగ్ నిర్వహించగా ఒక్క ఓటు తేడాతో అడువాల జ్యోతి ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. కాగా జగిత్యాలలో 48 వార్డులున్నాయి. ఇందులో బీఆర్ఎస్ 30, కాంగ్రెస్ 7, బీజేపీ 3, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ 1, ఏఐఎంఐఎం 1, ఇండిపెండెంట్ అభ్యర్థులు ఆరు స్థానాల్లో విజయం సాధించారు. మూడేళ్ల క్రితం జరిగిన చైర్‌పర్సన్ ఎన్నికలో బీసీ కేటాగిరిలోని పద్మశాలీ సామాజిక వర్గానికి చెందిన బీఆర్ఎస్ 37వ వార్డు కౌన్సిలర్ బోగ శ్రావణి ఎన్నికయ్యారు. సుమారు యేడాది క్రితం బోగ శ్రావణి మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. యేడాదిగా మున్సిపల్ వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్ ఇన్‌చార్జి చైర్మన్‌గా వ్యవహరించారు.

● విప్ ధిక్కరించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు..

మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా మెజార్టీ కౌన్సిలర్ల స్థానాలను కలిగిన బీఆర్ఎస్ విప్‌ను జారీ చేసింది. పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు బీఆర్ఎస్‌కు చెందిన 39వ వార్డు కౌన్సిలర్ సమిండ్ల వాణిని మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రకటిస్తూ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ విప్‌ను జారీ చేశారు. అయితే సంబంధిత విప్‌ను దిక్కరిస్తూ ఎన్నిక సమావేశంలో తొమ్మిది మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఓటు వేయడంతో రెబల్ అభ్యర్థి జ్యోతి గెలుపొందడం చర్చనీయాంశంగా మారింది. విప్ దిక్కరించిన కౌన్సిలర్ల వ్యవహార తీరుపై బీఆర్ఎస్ అధిష్ఠానం ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనన్న చర్చ జగిత్యాల బల్దియా రాజకీయ వర్గాల్లో చోటుచేసుకుంది. అయితే సంబంధిత విప్ జారీ సమాచారం తమకు అందలేదని పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు వాదిస్తున్నారు.

● ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నివాసంలో సంబరాలు..

పట్టణంలోని జమ్మి గద్దె సమీపంలో గల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నివాసం వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికయిన బీఆర్ఎస్ రెబల్ అడువాల జ్యోతి సంబరాల్లో భాగస్వామ్యమయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా విజయం సాధించిన అనంతరం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నివాసానికి అడువాల జ్యోతితో పాటు ఆమె మద్దతు దారులు వెళ్లారు. జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు శాలువలు, పూలమాలలో అడువాల జ్యోతిని సత్కరించారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ పార్టీలకతీతంగా పట్టణ అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డిలను కలుపుకొని పోతూ అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయ లక్ష్మీ దేవేందర్‌రెడ్డి, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● బాధ్యతలు స్వీకరించిన జ్యోతి

జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా అడువాల జ్యోతి లక్ష్మణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం పాటుపడతానని, అందరి సభ్యుల సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వల్లెపు రేణుక మొగిలి, సింగం పద్మ సింగారావు, గుగ్గిల్ల హరీష్ తదితరులు పాల్గొన్నారు.

● విప్ ధిక్కారం ఫిర్యాదు అందితే పరిశీలిస్తాం...

- జడ్పీ సీఈవో, ఎన్నికల అధికారి గౌతంరెడ్డి

బీఆర్ఎస్ పార్టీ సమిండ్ల వాణిని చైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రకటిస్తూ విప్ జారీ చేసింది. అయితే పలువురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు విప్‌ను ధిక్కరించినట్లు పార్టీ ఫిర్యాదు చేస్తే తదుపరి పరిశీలన చేపడుతాము. నిబంధనల ప్రకారం ఫిర్యాదుపై పరిశీలన జరిపి, విప్‌ను ధిక్కరించినట్లుగా తేలితే సదరు కౌన్సిలర్లకు షోకాజు నోటీసులు అందజేయాల్సి ఉంటుంది. షోకాజు నోటీసుకు నిర్ణీత గడువులోగా సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. విప్‌ను ధిక్కరించిన కౌన్సిలర్లు షోకాజు నోటీసు స్వీకరించిన అనంతరం ఇచ్చే సమాధానంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం బీఆర్ఎస్ కౌన్సిలర్ల విప్ ధిక్కారంపై ఎలాంటి ఫిర్యాదు రాలేదు.

గోల్డ్‌మెడల్ అందుకున్న మల్యాల యువకుడు



గోల్డ్‌మెడల్, పట్టాను అందుకుంటున్న సాత్విక్

మల్యాల, ఫిబ్రవరి 28: మల్యాల మండల కేంద్రానికి చెందిన చిలుక సాత్విక్ అనే యువకుడు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకున్నాడు. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ 16వ స్నాతకోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంటెక్ స్ట్రక్చరల్ ఇంజనీర్ అయిన సాత్విక్ ఆర్కిటెక్చర్ పీజీలో యూనివర్సిటీ గోల్డ్‌మెడల్‌కు ఎంపికయ్యాడు. దీంతో యూనివర్సిటీ చాన్స్‌లర్, గవర్నర్ తమిళిసై మెడల్‌తో పాటు ప్రశంసపత్రం, పీజీ పట్టాను అందజేశారు.

సంక్షిప్త సమాచారం..

మల్యాల: మండలంలోని మద్దుట్ల శివారులో గల అటవీ ప్రాంతాన్ని ఫారెస్ట్ సీసీఎఫ్ శర్వనన్ పరిశీలించారు. నేచరల్ వాచ్‌లో భాగంగా అటవీ అధికారులు గుట్టలపై దాదాపుగా రెండు కి.మీ మేర చెట్లు, వాటి ఎదుగుదల, కందకాలు పరిశీలించారు. అటవి సంరక్షణకు తీసుకోవల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అటవి శాఖ అధికారి వెంకటేశ్వర్‌రావు, కొడిమ్యాల ఫారెస్ట్ రేంజ్ అధికారి బి.లత, ఓగులాపూర్ ఎఫ్‌ఎస్‌వో రత్నమ్మ బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

మల్లాపూర్: చెరుకు కర్మాగారాలను పునరుద్ధరణ కమిటీ మార్చి ఐదో తేదీన ముత్యంపేటకు రానున్న నేపథ్యంలో పలువురు రైతులు హర్షం ప్రకటిస్తూ స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతు నాయకులు కర్మాగారం ఎదుట మాట్లాడారు.

ఇబ్రహీంపట్నం: ప్రొటోకాల్‌పై మాట్లాడే అర్హత ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. గతంలో కల్వకుంట్ల సంజయ్‌కు ఏ అధికారం లేకున్నా కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఏ విధంగా పంపిణీ చేశారో తెలపాలన్నారు.

కథలాపూర్: మండలంలో ఉపాధిహామీ పనులకు సంబంధించి కూలీల హాజరు శాతాన్ని పెంచాలని ఎంపీడీవో శంకర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు.

కోరుట్ల: జార్ఖండ్‌లో జరిగిన నేషనల్ స్కూల్ 67వ ఖోఖో పోటీల్లో పట్టణంలోని జూనియర్ కళాశాకు చెందిన గుగులోతు వినాయక్ ప్రతిభ చాటి వెండి పతకం సాధించాడు. ఈ మేరకు ప్రిన్సిపాల్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ ప్రేమలత, పీఈటీ ప్రణయ్ అభినందించారు.

కోరుట్ల: పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం పక్కన ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని దీంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రాంతవాసులు మున్సిపల్ కమిషనర్ తిరుపతికి ఫిర్యాదు చేశారు.

ప్రారంభమైన అంబటి మల్లన్న పట్నాలు

ఎండపల్లి, ఫిబ్రవరి 28: మండలంలోని మారేడుపల్లిలో అంబటిమల్లన్న పట్నాల కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం రెండురోజులు సాగనుంది. బుధవారం రోజున గ్రామస్థులు ఒగ్గు డోలు కళాకారులతో కులాలకు అతీతంగా గ్రామంలోని దేవుడి వద్దకు బోనాలతో కలిసి దేవస్థానానికి చేరుకున్నారు.

ఉదయం జోగు తిరుగుట వంటి కార్యక్రమం నిర్వహించారు. గురువారం స్వామి వారి పట్నం జరగనుంది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.



బోనాలతో మారేడుపల్లి గ్రామస్థులు

విప్ ధిక్కరించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లపై ఫిర్యాదు చేస్తాం

- ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్

జగిత్యాల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా విప్ ధిక్కరించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 29 మంది పార్టీ కౌన్సిలర్‌లకు విప్ జారీ చేశామని, ఇందులో 20 మంది కౌన్సిలర్‌లు పార్టీ అభ్యర్థికి మద్దతు ప్రకటించగా, 9మంది పార్టీకి చెందిన కౌన్సిలర్లు పార్టీ విప్‌నకు వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. విప్ ధిక్కరించిన కౌన్సిలర్లపై వేటు తప్పదన్నారు. జిల్లా అధ్యక్షుడి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి పార్టీ నుంచి సస్పెండ్ అయ్యేలా చూస్తామన్నారు. అధికారం కోసం పార్టీలు మార్చిన చరిత్ర ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిదని ఆరోపించారు. స్థానిక సంస్థలపై తరుచూ స్పందించే జీవన్‌రెడ్డి, సర్పంచ్ ఎన్నికలను నిర్వహించకుండా ప్రత్యేక అధికారుల పాలనను ఎందుకు తెచ్చారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్‌లు బీఆర్ఎస్‌కు చెందిన అడువాల జ్యోతికి మద్దతు పలకడం విడ్డూరం అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి కూడా కాంగ్రెస్ కౌన్సిలర్‌లు చేతులు లేపడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీ మాదిరిగా కాంగ్రెస్ బీజేపీలు విప్ జారీ చేయకపోవడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించిన ఆయన, బీసీల పట్ల ప్రేమ ఒలకబోస్తున్న జీవన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ రిజర్వేషన్‌లలో నియోజకవర్గంలో రెండు ఓసీకే కేటాయించడం దేనికి సంకేతమో ప్రజలే ఆలోచించాలన్నారు.



సమావేశంలో మాట్లాడతున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గోలి శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షుడు గట్టు సతీష్, నాయకులు పాల్గొన్నారు.

● కలెక్టర్‌కు వినతి..

మున్సిపల్ ఎన్నిక నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ జారీ చేసిన విప్‌ను ధిక్కరించిన కౌన్సిలర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పార్టీ శ్రేణులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. చట్టప్రకారం వారిపై అనర్హత వేటు వేయాలని కోరారు. ఆయన వెంట పార్టీ కౌన్సిలర్‌లు, నాయకులు ఉన్నారు.